# జంతువు

అమ్మా నాన్నా చెడ్డవాళ్ళేం కాదు. అయినా వాళ్ళకూ నాకూ గొడవొచ్చిందంటే అందుకు కారణం వేరే ఉంది.

పుట్టి పెరిగి గిట్టడంతో తృప్తి చెందాలనుకుంటే జంతువుకూ మనకూ తేడా ఉండదంటాను నేను.

మనిషికి జీవితంలో లక్ష్యముండాలి. లక్ష్యాన్నేర్పరిచే ఆదర్శాలుండాలి. నాకు ఆదర్శాలున్నాయి.

తొమ్మిదవ తరగతి చదివేటప్పుడు పరీక్షల సమయంలో నాకు జబ్బు చేసింది. పరీక్షలింక రెండు రోజులున్నాయనగా నేను మామూలు మనిషినయ్యాను.

మా స్కూల్లో క్లాసులో ఫస్టు వచ్చేవారికి స్కాలర్‌షిప్పుంటుంది. అదెప్పుడూ నాకే వస్తుంది. బాగా చదువుతానని స్కూల్లో టీచర్సందరికీ నేనంటే అభిమానం.

ఆ సంవత్సరం నాకు స్కాలర్‌షిప్ అవకాశం పోతుందని నాన్న భయపడ్డాడు. ఆయన టీచర్సుతో మాట్లాడాడు.

నాన్న పనిచేసే ఆఫీసు ద్వారా టీచర్సుకు చాలా ప్రయోజనాలుంటాయి. హెడ్మాస్టరుతోసహా అంతా నాన్నకు చాలా విలువనిస్తారు. అది ఉపయోగించుకోవాల్సిన

అవసరం ఇంతవరకూ నాన్నకు కలిగించలేదు నేను.

అప్పుడు నాన్న కష్టపడి ముందుగానే పేపర్సు తెలుసుకుని వచ్చాడు.

నాన్న చేసిన పనికి చాలా కోపం వచ్చింది నాకు. ఏమీ చెప్పలేదు పైకి. ఆ పేపర్లు చూడలేదు.

ఆ సంవత్సరం క్లాసులో ఆరవ వాడుగా వచ్చాను.

టీచర్సు ఆశ్చర్యపడ్డారు. నాన్న కోప్పడ్డాడు. "నా స్వయం కృషితోరాని స్కాలర్‌షిప్పు నాకవసరం లేదు......." అని నాన్నకు కచ్చితంగా చెప్పాను.

"నీలో క్లాసుకు ఫస్టుకురాగల ప్రతిభ ఉంది. ఫరీక్షల ముందు జబ్బు చేయడం నీ దురదృష్టం. నేను నీ దురదృష్టాన్ని తొలగించడానికి ప్రయత్నించాను తప్ప స్వయంకృషికి అడ్డురాలేదు -" అన్నాడు నాన్న.

"మన పనిమనిషి కొడుకు అప్పన్న ఎంతో తెలివైనవాడు. ఎంత కష్టమైన విషయమైనా ఇట్టే అర్థమవుతుంది వాడికి. పనిమనిషి కొడుకుగా పుట్టడం వాడి దురదృష్టం" అన్నాను.

"అయితే ఏమంటావ్?" అన్నాడు నాన్న.

"మనదేశంలో దురదృష్టవంతులు చాలా మంది ఉన్నారు. దురదృష్టాన్ని అన్యాయంతో కాక స్వయంకృషితోనే సరిదిద్దుకోవాలి-" అన్నాను.

అప్పుడు అమ్మ కలగజేసుకుని - "మనవాడు చాలా గొప్పవాడైపోతాడే మోనండీ-" అంది.

"ఇలాంటి వాళ్ళు గొప్పవాళ్ళు కాలేరు. అవకాశవాదులే గొప్ప వాళ్ళవుతారు......" అన్నాడు నాన్న.

నేను గొప్ప ఆదర్శవాదినని అమ్మ సంబరపడింది. కానీ అమ్మ పద్ధతులూ నాకు నచ్చేవికాదు.

ఇరుగు పొరుగులకు నా గురించి లేనిపోని గొప్పలు చెప్పేది. అప్పుడప్పుడు నావల్ల తప్పు జరిగినా పట్టించుకోకుండా చిన్న పిల్లలు తప్పు చేయడం సహజమనేది. మా యింట్లో చిల్లర పనులు చూస్తూండే అప్పన్న విషయంలో అ క్షమాగుణం కనపడేదికాదు.

ఈ విషయంలో అమ్మను నిలదీస్తే - "నువ్వు వేరు, అప్పన్న విషయం వేరు-" అనేసింది.

"మనుషులంతా ఒక్కటే-" అన్నాను. అమ్మ కాసేపు వాదించి - "నీతో వేగలేమురా బాబూ" అంది. ఆ తర్వాత నేను చూస్తుండగా అప్పన్న విషయంలో జాగ్రత్తగా ఉండేది.

అప్పన్నకు నేను చదువు చెప్పేవాణ్ణి. అప్పన్న నాకంటే పెద్దవాడు - బహుశా రెండు మూడేళ్ళు.

"అప్పన్నా! నీ చేత మెట్రిక్ కట్టిస్తాను. తర్వాత టైపు. షార్టుహ్యాండు నేర్చుకుందువుగాని. నీవు వెనుకబడిన కులం వాడివి కాబట్టి వెంటనే మంచి ఉద్యోగం దొరుకుతుంది. నీ తర్వాత నీ యింట్లో ఎవ్వరూ ఒకరిని సేవించుకుంటూ బ్రతక్కూడదు" అని వాడికి చెబుతూండేవాణ్ణి.

వాడు తెలివైనవాడే. కానీ చదువుకోవాలన్న పట్టుదల లేదు.

ఇంటర్మీడియేట్ అయ్యాక నాకు ఖరగ్‌పూర్ ఐ ఐ టిలో ఇంజనీరింగ్‌లో సీటు వచ్చింది. అక్కడ హాస్టల్లో అప్పన్న గురించి ఒక ఉద్యోగం కూడా సంపాదించాను.

జీతం తక్కువైనా వాడి తిండి, బట్ట ఖర్చులు సరిపోతాయి. తీరిక సమయంలో నేను వాడికి చదువు చెప్పవచ్చు.

అప్పన్న ఉద్యోగంలో చేరాడు కానీ వాడికి చదువబ్బలేదు. పేకాట వగైరా దురలవాట్లబ్బాయి. వాడిని నేను అదుపు చేయలేకపోయాను. చివరికింటికి పంపేయాలనుకున్నాను.

వాడు వెళ్ళనన్నాడు.

"నీ ఉద్యోగంతీయించేస్తా" అన్నాను. అయినా అప్పన్న లెక్కచేయలేదు. కేవలం వాడికి బుద్ధి చెప్పాలని ఉద్యోగం తీయించేశాను.

అప్పన్న యింటికి పోలేదు. వాడికి బ్రతుకుతెరువు తెలిసింది. ఊళ్ళో కష్టపడి బ్రతకవారంభించాడు.

కూలిపని చేస్తున్నాడు. రిక్షా లాగుతున్నాడు.....

అంతవరకూ బాగానే ఉంది.

కానీ వాడు పేకాడుతున్నాడు. తాగుతున్నాడు.

అప్పన్న గురించి తల్చుకుని బాధపడ్డాను.

నా క్లాస్‌మేటు భార్గవ అప్పన్న కథ విని "మనుషులందరూ మనుషుల్లా బ్రతకలేరు. కొందరు జంతువులుగా బ్రతక్క తప్పదు-" అన్నాడు.

"ఎందుకిలాజరుగుతోంది?" అన్నాను బాధగా.

"మనిషి మనిషిని శాసించ లేడు. జంతువును శాసించగలడు - అదెంత బలమైనదైనా సరే! ప్రపంచంలో శాసించగలవారు కొందరే ఉంటారు. అందు గురించి మిగతా వారందరూ జంతు ప్రవృత్తిని కలిగుండాలి".

భార్గవ మాటల్లో నిజముంది. ఆ నిజం నన్ను బాధించింది.

"నేను జంతువులా జీవించను. ఎన్ని కష్టాలొచ్చినా ఆదర్శాలకు కట్టుబడి ఉంటాను. అదే నా లక్ష్యం" అనుకున్నాను.

ఇంజనీరింగు ఫస్టు క్లాసులో ప్యాసయ్యాను. బెంగుళూర్లో యం.యీ.కి. సీటొచ్చింది.

అప్పుడే నేను ప్రేమలో పడ్డాను.

ఆమె పేరు కుసుమ.

మనిషి కుసుమ కోమలంగా ఉంటుంది.

బస్సు దగ్గర పరిచయమయింది.

ఆమె బియ్యే చదువుతోంది. స్పోర్ట్సు నుంచి రాజకీయాల వరకూ ఆమెకు తెలియని

విశేషాలు లేవు.

కుసుమ చలాకీతనం నన్నెంతగానో ఆకర్షించింది.

ఆమె నన్ను తన తలిదండ్రులకు పరిచయం చేసింది.

సామాన్య మధ్యతరగతి కుటుంబం - మాకులాగే!

కుసుమ వారికి మూడో అమ్మాయి. ఇద్దరమ్మాయిలకు పెళ్ళిళ్ళు చేసి చితికిపోయివున్నారు వాళ్ళు.

ఆడపిల్ల పెళ్ళి గురించి నాకూ కొంత తెలుసు. నాన్న కూడా ఇద్దరాడపిల్లల పెళ్ళిళ్ళు చేశాడు. నాకు ఎస్టీ ఎస్ యీ స్కాలర్‌షిప్ లేకపోతే ఆయన నన్ను చదివించగలిగే వాడా అన్నది అనుమానమే! బహుశా మా ఊళ్ళోనే ఏ బీయస్సీయో చదివి ఫుల్‌స్టాప్ పెట్టేసి ఉండేవాణ్ణి.

కుసుమ తలిదండ్రులు మా వివాహాని కంగీకరించారు.

నాకు కుసుమను జీవితంలోకి వెంటనే ఆహ్వానించాలని ఉంది. ఆమె తలపులోకి రాగానే నా మనసేదోలా అయిపోతోంది.

కుసుమ గురించి చెప్పాలని ఇంటికి వెళ్ళాను.

ఇంటిదగ్గర నా కోసం ఓ సంబంధం రెడీగా ఉంది.

యాభై వేల రూపాయల కట్నం - వైభవంగా పెళ్ళి. అక్కలకు, అమ్మకు ఘనంగా లాంచనాలు - బంగారు బొమ్మలాంటి పిల్ల - అన్నింటికీ మించి పిల్ల ఉత్తమురాలు. సంప్రదాయ పద్ధతుల్లో పెరిగింది.

అప్పుడు నేను కుసుమ గురించి చెప్పాను.

ఇంట్లో పెద్ద గొడవయింది.

"కట్నం తీసుకోకూడదన్నది నా ఆదర్శం. కులాలు నమ్మకూడదన్నది నా సిద్ధాంతం. సంప్రదాయాన్ని వ్యతిరేకించి ఈ పెళ్ళి చేసుకుని తీరతాను. ఆశీర్వదించారా సరేసరి - లేదూ మీకూ నాకూ సరి!" అని చెప్పేశానింట్లో.

నాన్న ఆశలు కూలిపోయాయి. ఆయన నానా మాటలూ అన్నాడు. చివరికి ఫలితం లేదని గ్రహించి కుసుమ వివరాలడిగాడు.

కుసుమ తెలుగు పిల్లే కానీ ఆమెది మా కులం కాదు.

మళ్ళీ పెద్ద గొడవయింది.

"ఒక్కగానొక్క కొడుకు మూలంగా వంశం ఉద్ధరించబడుతుందనుకున్నాను. ఇలా వర్ణ సంకరం చేస్తాడనుకోలేదు" - అంటూ శోకాలు పెట్టింది అమ్మ.

నాకు అమ్మ శోకాలు వినిపించడం లేదు.

కుసుమ......కుసుమ.......

నా ఆలోచనలనిండా కుసుమ.......

నా చుట్టూ కుసుమ..........

అది ప్రేమించే వయసు. నా ప్రేమకు సమాధానం కుసుమ.

ఆమె చిరుదరహాసంలో వెన్నెలలు కురుస్తాయి. ఆ వెన్నెల మండుటెండలా నన్ను బాధిస్తుంది.

ఆమె చల్లని ఒడిలో సేదదీరాలని నాకుంది.

అమ్మ, నాన్న నా పట్టుదల ముందు ఓడిపోయారు.

కట్నం తేలేదన్న కారణంగా, కులం వేరన్న కారణంగా కుసుమను వారు నిరసించడం నేను భరించలేను.

మా వివాహం జరిగింది.

నాకుద్యోగం వచ్చింది విశాఖపట్నంలో!

కుసుమ, నేను కాపురం ప్రారంభించాం.

ఒక సంవత్సరంపాటు నాకు ప్రపంచం తెలియలేదు.

నిజంగా ఆడది మగాడి జీవితానికి వరం.

కుసుమ నాకు వరంలా, అదృష్ట దేవతలా అన్ని వేళలా అనిపించేది.

తరచు నా అదృష్టాన్నామె ముందు పొగుడుతూండేవాణ్ణి.

“నీకంటే గొప్ప అదృష్టం నాది” అనేది కుసుమ.

అయితే అది నిజం కాదని నాకనిపించేది. ఆమె నా జీవితంలో ప్రవేశించి నాకెంతో ఆనందాన్నిచ్చింది. ఆమెకు నేను సరైన ప్రతిఫలమివ్వడంలేదని నాకు తోచింది.

“నీకేంకావాలో చెప్పు కుసుమా!” అని తరచు అడిగేవాణ్ణి.

“మీరు తప్ప నాకింకేమీ వద్దు” అనేది కుసుమ మొదట్లో.

క్రమంగా కుసుమ తన కోరికలు చెప్పడం ప్రారంభించింది.

బ్రతికి చెడ్డ కుటుంబం కుసుమది.

ఆమెకిప్పుడు వైభవంగా జీవించాలని ఉంది.

ఖరీదైన చీరలు, విలువైన నగలు, అందమైన బంగళా, ఎయిర్ కండిషన్డు కారు......

ఇలాంటి కోర్కెలు చాలా ఉన్నాయామెకు.

అప్పుడు నేనామెకు నా ఆదర్శాల గురించి చెప్పాను.

ప్రభుత్వోద్యోగం చేస్తూ, నీతినే నమ్ముకుంటూ, తీరిక సమయాన్ని అట్టడుగు వర్గాల వారి క్షేమం కోసం ఉపయోగించడం నా ఆశయం.

అందుకుదాహరణగా అప్పన్న కథ కూడా చెప్పాను.

“అప్పన్న వంటి వారిని మానసికంగా బాగుచేయాలి. వాళ్ళు జంతువుల్లా తిరుగుతూంటే నేను, నువ్వు మనుషుల్లా వారి మధ్య సుఖించలేము......” అన్నాను.

కుసుమ ఏమీ అనకుండా ఊరుకుంది.

నాకెంతో అసంతృప్తి అనిపించి - "మనిషి ఆదర్శాలకు కట్టుబడి జీవించడంలోనే ఆనందముంటుంది" అన్నాను మళ్ళీ.

"ఏమో-నాకవన్నీ తెలియవు. మన చుట్టూ వున్నవాళ్ళలా ఉంటున్నారో - మనమూ అలాగే ఉండాలనిపిస్తుంది నాకు" అంది కుసుమ.

రెండు మూడు నెలల తర్వాత నేను కుసుమకో హారం చేయించి - "నీ కోసం ఎంతో కష్టపడి డబ్బు కూడబెట్టి చేయించానిది" అన్నాను. నిజం చెప్పాలంటే హారం గురించి నేను అప్పు కూడా చేశాను.

"నా కోసం మీరు శ్రమపడితే నాకు నచ్చదు. శ్రమ లేకుండా ఏం చేసినా నాకు సంతోషమే!" అంది కుసుమ.

అలాగంది కానీ అసంతృప్తి కుసుమ కళ్ళలో స్పష్టంగా కనపడేది - నేను చౌక వస్తువులు కొన్నప్పుడు.

తన కోరిక తీరనప్పుడామెకళ్ళలోకి నీళ్ళు వచ్చేవి.

నేను విలువైనదేదైనా తన కోసం కొంటే ఆమె కళ్ళు వింతకాంతితో మెరిసేవి.

ఆమె కళ్ళలోని మెరుపు నాకెంతో యిష్టం.

ఆమె కళ్ళ నీళ్ళు - యాసిడులా నన్ను బాధించేవి.

కుసుమ....కుసుమ....

నా ఆలోచనల నిండా కుసుమ....

నా కోర్కె- ఆమె సంతోషం!

అప్పుడు నేను చుట్టూ ప్రపంచాన్ని శ్రద్ధగా గమనించసాగాను.

ఎవరి జీవితం వారిది. ఎవరి స్వార్థం వారిది. ఎవరి సుఖం వారిది.

అవకాశమున్నవాడు తన కోసం ఏమైనా చేస్తున్నాడు.

అవకాశం దొరకనివాడు నీతులు వల్లిస్తున్నాడు.

నాకు చాలా అవకాశాలున్నాయి.

ఆలోచిస్తూంటే....

నా ఆలోచనలనిండా అవకాశాలు....

నా చుట్టూ అవకాశాలు....

కుసుమ.... అవకాశాలు....

రెండూ నా ఆలోచనల్లో కలాగాపులగమై పోతున్నాయి.

క్రమంగా నాలో కుసుమ సంతోషించే మార్పు వచ్చింది. ఆమె కోరిక లొక్కొక్కటిగా తీరుతున్నాయి.

అయితే కుసుమ చాలా మంచిది.

ఆమె తన వైభవాన్ని తనకు మాత్రమే పరిమితం చేసుకోలేదు. నా వారందరితోనూ పంచుకోవాలనుకుంది.

కుసుమ ఆడపడుచుల్నింటికి పిలిచి ఆదరిస్తోంది. వారామెనాశీర్వదిస్తూ "మా తమ్ముడింత ప్రయోజకుడయ్యాడంటే అది నీ అదృష్టం-" అని మెచ్చుకుంటూంటారు.

అమ్మకూ, నాన్నకూ ఇప్పుడు కుసుమపై ద్వేషం లేదు.

వారి ఆర్థిక పరిస్థితి బాగుపడడమేకాక- జీవితం వైభవంగా నడుస్తోంది.

"కులమతాల్లో ఏమీ లేదు . కుసుమ వంటి కోడలు లభించడం మా అదృష్టం" అని నాన్న తరచు ఆమెను మెచ్చుకునేవాడు.

అమ్మ కుసుమను అభిమానించేది. కానీ నా వద్ద కుసుమ గురించి ఏమీ అనేది కాదు.

వివాహమైన అయిదేళ్ళకు కుసుమ గర్భవతి అయింది.

అమ్మ పురుడుపోయడానికి వచ్చింది. "కుసుమను పుట్టింటికి పంపను. వాళ్ళే ఇక్కడికి వస్తారు.... "అంది అమ్మ.

అత్తగారి అభిమానానికి కుసుమ ఎంతో సంతోషించింది.

"అమ్మా పుట్టబోయే మనుమడిని వంశోద్ధారకుడంటావా, అనవా?" అన్నాను నేను.

అమ్మ నవ్వి "కుసుమ కన్న బిడ్డ వంశోద్ధారకుడు కాకుండా పోడు. ఈ అదృష్టమంతా కుసుమదే. కానీ మేము చెప్పిన పెళ్ళి చేసుకుని ఉంటే నువ్విప్పుడీ స్థితికి ఎదిగి ఉండేవాడివనుకోను. ఆదర్శాల పేరు చెప్పి నువ్వేమైపోతావోనని నాన్న అస్తమానూ బాధపడేవారు. నిన్ను మార్చినందుకు కుసుమంటే మా అందరికీ ఎంతో అభిమానం...." అంది.

అమ్మ ఆ మాటలు హేళనగా అన్నదనుకోను. కానీ నా కవి ఛెళ్ళున తగిలాయి.

"ఆదర్శం పేరు చెప్పి అమ్మా,నాన్నల మాట కాదన్నావు. మేము చెప్పిన పెళ్ళి చేసుకుని ఉంటే - ఒక ఆదర్శం చెడినా - నీ మిగతా ఆదర్శాలన్నీ నిలబడి వుండేవి. ఇప్పుడు నీకు స్వార్థం తప్ప ఏ ఆదర్శమూ మిగలలేదు" అని అమ్మ అన్నట్లు నాకు తోచింది.

అప్పుడు నాకు అప్పన్న గుర్తుకొచ్చాడు. వ్యసనాల కోసం వాడెంతైనా శ్రమ పడతాడు. అందుకని వాడిని జంతువనుకున్నాను.

మరి నేను....

కుసుమ ...నా చుట్టూ కుసుమ... నా ఆలోచనల నిండా కుసుమ....

తప్పు కుసుమది ఔనో కాదో తెలియదు. కానీ కుసుమ నేనూ జంతువునేనని ఋజువు చేసింది. ★

*(స్వాతి మాస పత్రిక - జనవరి, 1987)*